# శాంతిదేవతా శిల్పం



"కళానిలయా! ఇది నీ వల్లనే కావలిసి ఉంది నాయనా! ఈ పని చేయుటకు నీ వొకడవే అర్హుడవు!" అన్నారు శ్రీ భారతులు.

కళానిలయుడు తల వంచుకొని నిలుచున్నాడు.

"నాయనా! ఈ మహా దేవాలయ నిర్మాణంలో ఇక నీ చివరి ఘట్టమే మిగిలి ఉన్నది. దీని నిర్మాణం ఇదివరలోనే పూర్తిచేయవలిసినది. కాని అనివార్య కారణ బద్ధమై ఆగిపోయింది. ఇది విజయవంతంగా నిర్వహించిన ఇక దేవాలయానికి పరిపూర్ణత చేకూరుతుంది"— కళానిలయుని భావాలను అతడి కదలికలలో గమనిస్తూ అన్నారు శ్రీ భారతులు.

కళానిలయుడు వంచిన తల పైకెత్తాడు. అతడి లోతైన కళ్లలోని కంటిపాపల మిలమిల శ్రీ భారతుల పవిత్ర దృక్కులతో క్షణకాలం కలిసి కిందికి దిగిపోయింది.

కళానిలయుడు చిన్నగా తలవంచుకొన్నాడు.

"ఇంత మహోన్నతకార్యం నా చేతనా? నా వంటి అనర్హుడికి ఇటువంటి కార్యంలో విజయం అసంభవం, భారతశ్రీ!" తనను తక్కువ చేసుకొంటూ అన్నాడు కళానిలయుడు.

"నాయనా! అలా అనుట చాలా పొరబాటు. నీ కళకీ, నీ కీర్తికీ, నీ వృత్తికీ ద్రోహమొనర్చినట్లు. నీవంటి మహా శిల్పివల్ల కాక ఇంకెవరివల్ల ఈ కార్యం నెరవేరగలదు? కళాశ్రీ! నిన్ను మించిన శిల్పి ఇచ్చట ఎవరున్నారిక! అర్థించిన కార్యం నిర్వహించుట నీ విధి నాయనా! ఇది నీకు తప్పదు"—మెల్లగా, మృదువుగా, గంభీరంగా అని ఆగారు శ్రీ భారతులు.

కళానిలయుడి తల అప్రయత్నంగా పైకిలేచింది. అతడు యువకుడే, కాని వయస్సుకు మించిన అనుభవం అతని ముఖంలోని యౌవనచ్ఛాయలను దొంగిలించి వాటిస్థానే నలుపు గీతలను ప్రసాదించింది. ముడతలు పడిన అతడి ముఖంలో నిస్పృహ, నిరాశ గూడుకట్టుకొని ఉన్నాయి. కాని అతడి కనుగుంటల చీకటులనుంచి అద్భుతంగా మెరిసే కంటి మిలమిలలే ముఖానికి జీవం పోశాయి.

మళ్లీ శ్రీ భారతులు అన్నారు — "ఈ దేవాలయ శేషశోభ ఈ శిల్ప నిర్మాణంతో సంపూర్తి అవుతుంది. ఈ శిల్ప ప్రతిష్ఠ చేత ఈ దేవాలయ దివ్యకాంతి చిరస్మరణీయాద్భుత జ్యోత్స్నగా రూపొందుతుంది నాయనా! అపూర్వమైన దేవతాశిల్పం తయారు కావలిసి ఉన్నది. ఆ శిల్పం శాంతిశుభాల నిలయమై ఒప్పవలె. సర్వోత్కృష్టమై, సర్వ సౌందర్యానుభూతిగా మెరవవలె. సకల నయనానందకర సజీవ రూపమై తనరవలె! మూఢ పరిమూఢ జనసందోహ జ్ఞానదీపికయై తేజరిల్లవలె. నాయనా! కళానిలయా! నీ కిది ఆలోచనా సమయంకాదు. సంకల్పిత కార్యాచరణాలోకనా సమయం.

"నీ కిది పరీక్ష కాదు. దైవేచ్ఛ. నీ కార్యం సత్వరాన ఆరంభించు. నీ కెవ్వరివలన గూడ కార్యభంగం కాకుండా మేమంతా తగు జాగ్రత్త వహిస్తాము. ధైర్యం కూడ గట్టుకో. నీ ఆరోగ్యం భంగంకాకుండా చూసుకో. బలమైన ఆహారం, తగు విశ్రాంతి తీసుకొంటూ



రవీంద్రగోల్డుకవరింగ్ వర్క్సు (REGD)
చిలకలపూడి P.O. మచిలీపట్నం-2.



లాజిన్



పేలు, ఈపి, చుండ్రు నివారిణి.

అన్ని షాపులలో అమ్మబడును
డిస్ట్రిబ్యూటర్లు :—
శ్రీనివాస మెడికల్ & ఫాన్సీ మార్టు
రేపల్లె, గుంటూరు జిల్లా.
11-42-45, రాంగోపాల్ వీధి, విజయవాడ-1;
595, పతంగె బిల్డింగ్సు, సిద్ధింబజార్,
హైదరాబాద్; 12/62, మెయిన్‌రోడ్డు, వరంగల్.



శుభ్రపరచటం ఒక్కటే కాకుండా
ఎన్నో లాభాలను కలిగించేది
మార్గో సబ్బు ఒక్కటే మీ చర్మాన్ని
రక్షిస్తుంది శీతకాలంగాని
వేసవికాలంగాని

**ఎందుకంటే మార్గోలో**
**వేపనూనె ఉంటుంది**




మార్గోసబ్బు

మార్గోసబ్బు కలకత్తా కెమికల్స్‌వారి తయారీ

CCM-4183-A (Rev)


వాంఛలోనికి దొరలే పరిస్థితులు వచ్చాయి.

ప్రేమలోపడ్డ మానవుడు గుడ్డివాడై పోతాడు. అటువంటి ప్రేమచేత కళానిలయుడు చీకటి జల పాతాల్లోకి త్రోసివేయబడ్డాడు.

రోజువలే ఆ రోజుకూడా శాంతి కళానిలయులు చూతవృక్షచ్ఛాయలలో పిల్లగాలుల శీతల స్పర్శ నానం దిస్తూ నడుస్తున్నారు. అలా చాలా దూరం నడిచారు. మాటలు లేని ఆ మౌనావస్థ కండెలోని దారంలాగ వాతావరణానికి నడుగు పేకల్లుతూంది.

శాంతిని చూస్తున్న కళానిలయుడిలో వింతవాంఛలు పొరలుతున్నాయి. ఆమె స్త్రీత్వపు సౌందర్యం అతడి హృదయాన్ని అలుముకుపోయింది. దాని ప్రతిభ ముందు అతడి పురుషకారం తలవంచింది. సన్యాసాశ్రమంతో అదిమివేయబడిన పురుషుడు అతడిలో పాల పొంగువలె పొంగిపోయి నిలిచాడు. ఆ పొంగు నావగం శీతలోదకాలు కరువయ్యాయి. వాంఛలోనికి దొర్లిన ప్రేమ అతడి హృదయంలో అనంతాలకు పరుగు పెట్టింది.

ఒక్కమారుగా కళానిలయుడు శాంతి సుకుమార హస్తాన్ని తన చేత ఇముడ్చుకొని మెల్లగా నొక్కాడు. ఆమె చటుక్కున తల ఎత్తింది. ఆమె కంటి పాపల కాంతిలోని అమాయికత్వం అతడి కళ్ళలోని వాంఛల అగ్నిలో సమిధ అయిపోయింది. ఆమె దేహలత వింతగా చలించింది. ఎర్రని ఆమె అధరాలలోని తీయందనాలు చిన్నగా వణికాయి.

అతనిలోని పురుషత్వం ఆమె మృదువైన స్త్రీత్వాన్ని చుట్టివేసింది. అతడి కళా విదగ్ధ ప్రఫుల్ల వదనం వాంఛల వేడికి వింతగా విరిగిపోయింది. బలిష్ఠమైన అతడి పెదవులు సంపూర్ణతకొరకు ముందుకు కదిలాయి. కళానిలయుడు తనలో ఇమిడిపోయిన శాంతిని తనివోవ చుంబించాడు. మెత్తని ఆమె పెదవులు అతడి పెదవుల కింద నలిగివణికిపోయాయి.

ఇద్దరూ విడిపోయారు. అపవిత్ర ప్రేమాగ్నిలో పవిత్రమైన వారి అమాయిక హృదయాలు కాలిపోయాయి.

ఆ దినం మొదలుకొని ఆ చూత వృక్షచ్ఛాయలు అసంఖ్యాకమైన వారి రహస్య ప్రేమ సమాగాలకి సాక్షులై నిలిచాయి. వారి ప్రేమ ప్రవాహం అఖండితంగా సాగిపోయింది.

ఎన్నో దినాలు గడిచాయి. కళానిలయుడా ప్రేమ పరవశతలో అనాలోచితంగా కాలం గడిపేశాడు. సామాన్యమైన పురుషుల మానసిక స్థితికి దిగిపోయాడు. ఇన్నినాళ్ళూ అనుకోనంత సులువుగా లభించిన సౌందర్యాన్ని అనుభవించిన అతడికి విసుగు వేసింది. విసుగుతో బాటు స్వార్థం తల యెత్తింది.

తాను సన్యాసి. వరుణానగర మహాదేవాలయ ముఖ్య శిల్పి. కళారాధకుడు. మహోత్కృష్ట గురువులు శ్రీభారతులకు స్నేహపాత్రుడు. అన్నింటికిమించి సకలం త్యజించి ప్రజాసేవయే పరమావధిగా నిర్వహింప బడుతున్న ఆర్తజనసేవా బృందంలో ఒకడు. తానీ ప్రేమలో కృంగిపోతే తన స్థితికి విఘాతం. శ్రీభారతుల కోపానికి తాను గురియై నిలువవలసి వస్తుంది. సేవాబృందము నుండి వెలివేయబడతాడు. తన కళకి సాఫల్యం చేకూరదు.

అన్నింటికీ తాను వెలియై, బలియైపోతాడు.

కళానిలయుడి మనసులో ఈ ఆలోచనలు మెదిలాయి. వెంటనే అతడు భయపడ్డాడు. ఈ ఆలోచనలు అతడి మనసును కలచివేశాయి. అతడి హృదయం అర్థంకాని వ్యాకులతతో పెనుగులాడింది. చేతికలవికాని చుక్కాని అతడి జీవన నావకు క్షణం క్షణం గండాన్ని జోస్యం చెప్పింది.

ఆ దినాన శాంతి కళానిలయులు ఎప్పటివలే వాహ్యాళికి బయలుదేరారు. శాంతి అలౌకిక పరవశతతో, కళానిలయుడు ఇహలోక జీవిత సుఖ స్వార్థచింతనా మలిన హృదయంతో నడుస్తున్నారు. దినకరుడు చూతవృక్ష ఛాయలగుండా పడమటనుండి రత్నాలు, పవడాలు వెదజల్లుతున్నాడు. సంధ్యాసమయపు సూర్యుని నులివెచ్చని కాంతి ఆ చల్లని నీడలను చొచ్చుకొనిపోతూంది.

కొంతదూరం నడిచాక కళానిలయు డాగాడు. అరణ్యాగ్నిని రగిల్చే ముందు ఒకదానిపై నొకటి రాసుకొనే వృక్షశాఖలు చేసే శబ్దంవలె అతడి హృదయం విపరీతంగా శబ్దించసాగింది.

కళానిలయునితోబాటు శాంతి ఆగింది. అతడామెకేసి చూశాడు. ఆమె అతడిలోకి చూసింది. పోగులు పోసిన ప్రాతఃకాలపు తెల్లమల్లెల కాంతివలె ఆమె కళ్లల్లోని అమాయికత్వం మెరిసిపోతూంది స్వచ్ఛంగా. ఆ వదనంలో దుఃఖచ్ఛాయలకు సందులేని శాంతి నెలకొని ఉంది. ఆమె చెక్కిళ్లలో పాలవెల్లి శోభ వెలిగిపోతూంది. ఆమె చుబుకం తామర మొగ్గవలె వట్రువగా నిగనిగలాడుతూంది. ఆమె వదనంమధ్యన ఆ పెదవులలోని ఎఱ్ఱదనం రుచిరమై అలరారుతూంది.

కళానిలయుని కనులు దించుకుపోయాయి. ఆమె పవిత్రమైన చూపులోని కతడు సూటిగా చూడలేకపోయాడు. అతడి హృదయం సిగ్గుతో, వేదనతో ముకుళించుకుపోయింది.

"శాంతీ!" కళానిలయుని కంఠంలో వేయి అపశ్రుతులు పలుకుతున్నాయి. అధైర్యంతో ఆగిపోయాడు.

శాంతికి ఈ హఠాత్సంబుద్ధి అర్థంకాలేదు. అయోమయంగా అతడికేసి చూసింది. పరిచితమైన అతని మాటలలోని మృదుశైలి ఈ వేళ వేయివక్కలై తన హృదయాన్ని స్పృశించి బాధిస్తున్నట్లు భ్రాంతి చెందింది. భయపడింది.

"శాంతీ! ఈ వేళనుండి మన సమాగానికి వీలులేదు. రేపటినుండీ నీవు నన్ను కలియ ప్రయత్నించవద్దు." గొంతును చిక్కబట్టుకుని అన్నాడు కళానిలయుడు అతి ప్రయత్నంమీద. అతడి హృదయాంతరాళాల నుండి ఉబికిన ఆవేదనా బాష్పాలు స్వార్థచింతన పొరలలో ఇంకిపోయాయి.

"శాంతీ! నా ఈ హఠాన్నిర్ణయానికి అర్థం నీకు చెప్పలేను. కాని నీ పై నా ప్రేమ నిరంతరం. నాపై నీ ప్రేమ అనంతం. సంపూర్ణంగా అపవిత్రులం కాని మునం విడిపోదాము. ఇంతకన్న నేను నీకు చెప్పగల విషయం ఏమీలేదు." కళానిలయుడింతకంటె మాట్లాడలేకపోయాడు.

శాంతిలోని శాంతి ఎప్పటివలె దివ్యంగా వెలుగుతూంది. ఆమెలోని నిశ్చలత అనంతాలకు ముడి వేసుకొంది. ఆమె అమాయికత్వం భగవంతుని ఆత్మతత్త్వంలాగ పవిత్రంగా పరిమళించింది. ఆమె అధరకాంతి దేవలోకపు అమృత పుష్పతేజంలాగ భాసిల్లుతూంది.

కళానిలయు డాశించినది జరగలేదు. ఆమె తన వాక్యాలు విన్న వెంటనే తనను ప్రార్థిస్తుందనీ, తన ప్రేమ నర్థిస్తుందనీ, విలపిస్తుందనీ, నిట్టూర్పులు విడుస్తుందనీ అనుకున్నాడతడు. కాని అటువంటి స్వార్థకృత్యం ఆమె చేయలేదు. మెల్లగా తృప్తినిండిన కళ్లతో అతని కళ్లలోనికి ఒక్క పర్యాయం చూచింది. అమృతోపమమైన ఆమె లేత చిరునవ్వు వెన్నెల కాంతి రేఖవలె నోటి చివరలకు ఒరిగి కరిగిపోయింది అస్పష్టంగా.

తరవాత చిన్నగా తలవంచి కళానిలయుని చేతినెత్తి ముంజేతిని తన మెత్తని అధరాలతో మృదువుగా చుంబించింది. తలవంచుకుని వెనుదిరిగి వెళ్లిపోయింది. ఒక్కసారి కూడా ఆమె శిరసు కడకంటి చూపుకోసం పక్కకు తొణకలేదు.

సంపూర్ణత్వసిద్ధిపొందక ముందే తన తపస్సు భంగం



వీరవృద్ధుడు

ఫోటో—ఎ. డి. ఎశ్వర్ (నందిఘర్)

కావించిన దుష్టశక్తులను వదిలి ఆశ్రమానికి మరలిపోయే యోగినివలె ప్రకాశించింది శాంతి. లతవంటి ఆమె దేహం చూతవృక్షచ్ఛాయలలో క్షణకాలం వెలిగి అంతర్హితమైపోయింది.

అయోమయావస్థలో కళానిలయుడు వెను దిరిగాడు. మెల్లగా తన నిలయం చేరాడు.

ఆ మరునాడు వరుణానగరాన్ని ఆనుకొని పారే దివ్యకైశికీ గర్భంనుండి కలవ మొగ్గవలె శాంతి భౌతిక దేహం తేలింది. పురవాసులు దానిని ఒడ్డుకు చేర్చారు. ఇల్లుజేర్చినప్పుడు శాంతి దేహాన్ని చూసి వృద్ధురాలు ఏదో చిన్నగా గొణిగింది.

కాని కళానిలయుని హృదయం స్వార్థకవాటాలచేత మూసివేయబడింది. అతడెప్పటివలె తిరుగ మొదలెట్టాడు. కాని తాను చేసిన పాపం హృదయాన్ని కాల్చివేస్తుండగా ఆవేదనను అనుభవిస్తూ వయసుకు మించిన ముసలితనంతో నడిచిపోతున్నాడు. సకలమూ విడిచి కళారాధనలో మునిగిపోయి మానసికశాంతి కొరకు అన్వేషిస్తున్నాడు. శాంతి ప్రసాదించిన కడసారిచుంబనం అతడి ముంజేతిని నిప్పుముద్దవలె కాల్చివేస్తూంది.

గత స్మృతులతో నిండిన కళానిలయుని మనసు వేడిగా నిట్టూర్చి తెప్పరిల్లింది. దేవుని విగ్రహం వంక చూచి చేతులు జోడించా డతడు.

తను — అటువంటి అధముడు! తానీ కార్యం నిర్వహించటానికి అనర్హుడని విన్నవించినా శ్రీభారతులు తన మాట పెడచెవిని పెట్టారు. దైవంకూడా తన మొర ఆలకించలేదు.

కళానిలయునికి బాధతోబాటుగా కార్యనిర్వహణ నిశ్చయం కూడా కలిగింది.

మెల్లగా తనకు ప్రత్యేకించి అమర్చబడ్డ శిల్ప నిలయానికి వెళ్లాడు. శాంతి దేవతను స్థాపించవలసిన గూడు శూన్యంగా ఉంది. నిలయంలో సర్వసౌకర్యాలూ ఉన్నాయి. నలువంకల పెద్ద పెద్ద గవాక్షాలు, వాటిగుండా పూవువలె విచ్చుకొని కనులకు విందుచేసే ప్రకృతి సౌందర్యం. గదిలో లేఖికలూ, వర్ణాలు, తైలాలు, పెద్ద చిత్రఫలకం, మెత్తని బంకమన్ను, పాలరాతి స్తూపం, ఉలులు, సుత్తులు మొదలయిన సామగ్రి సిద్ధం చేయబడింది.

కళానిలయుడు శిల్పానికి వలసిన కొలతలు తీసుకొన్నాడు. అతడి మనసు ఉల్లాసంగా లేదు. అయినా కార్యనిశ్చయంతో నల్ల సీసపు లేఖిక చేత తీసుకుని చిత్ర ఫలకాని కెదర నిలువబడ్డాడు. అతడు ధరించిన అంగీ వివిధ తైలవర్ణపూతమై ఇంద్రధనస్సువలె ప్రకాశిస్తూంది.

ముందుగా శిల్పరూపానికి మాదిరిని ఊహించ నారంభించాడు. శిల్పం ఏ భంగిమలో ఉండాలో, వివిధావయవాల స్థానాలు, శిల్ప భావనారీతి, ఏ ఏ అలంకరణలు ఆ భావరీతిని ఉత్ప్రేక్షించగలిగి ఉండాలో అన్నీ ఆలోచించ మొదలుపెట్టాడు. అతడి మనసుకు నిశ్చలమైన, నిర్దిష్టమైన ఊహ తట్టలేదు. అయోమయావస్థలో లేఖికను చిత్రఫలక పీఠికపైన పడవేశాడు. నిస్పృహతో అతని నోటివెంట వెచ్చని ఊర్పులు వచ్చాయి. అతని లోతైన కండ్లలోని మెరుపు మెల్లగా మాయమైంది. అతడి వదనం మడ్డిరంగులోనికి మారిపోయింది. ఆ ముఖ కవళికలలో ఆవేదన కాలుతూంది.

తాను చేసిన దుష్కృత్యం వెంట తరుముతూంది అతడిని.

ఆ వేళ — శాంతి, తనూ విడిపోయిన రోజు తా ననుకొన్నాడు: 'నాదేం తప్పుంది? సన్న్యాసంలో కాలం గడుపుతున్న పవిత్రమైన నా మనసు ఆ శాంతి సౌందర్య వల్లరిలో చిక్కులుపడిపోయింది. ఆ సౌందర్యమే నన్నామె వైపుకు లాగివేసి హింసించింది. మరిగిమాడిపోయే నా హృదయ పరిరక్షణార్థమై నేను శాంతిని వదిలివేయవలసి వచ్చింది' లందరు పురుషులలో వలెనే తనలోనూ స్వార్థం కొండలాగు పెరిగింది. పవిత్రమైన శాంతిప్రేమను కిందవేసి నలిపివేసింది. ప్రేమ ప్రవాహాన్ని అరికట్టి అజేయంగా నిల్చింది. నీచుడై తాను తలవంచాడు. స్వలాభంకొరకు శాంతిని అశాంతిలోనికి తోసివేశాడు. శాంతి వెళ్లిపోతూ తన మానసిక శాంతిని వెంటబెట్టుకొని వెళ్లిపోయింది దేవుని సన్నిధికి.

కళానిలయుడి కళ్లలో నీళ్లు నిలిచాయి. మెల్లగా

పడమటి గవాక్షం వద్దకు పోయి అనంతాకాశంకేసి చూస్తూ నిలువబడ్డాడు. భాస్కరుడు ఎర్రగా, భారంగా కృంగిపోతున్నాడు. అతడి వేడికి తప్తమైన పడమటి గిరులు రాగివలె, పగడాలవలె మెరుస్తున్నాయి. కళానిలయుడు సూర్యకాంతిలోనికి కేంద్రీకరించి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

ఎంతకీ తెగని ఆలోచనలని అంతంచేసి మెల్లగా విచారంతో వెనుతిరిగాడు.

శ్రీ మహాదేవ దేవుని దేహకాంతిలోని ఒక కిరణం రెక్కలు కట్టుకుని వచ్చి అద్భుతతేజంతో నిలిచిపోయి నట్లు ఆ శిల్ప నిలయాన వెలిసిన ఒకానొక దివ్యరూపం వెలుగులు చిమ్ముతూంది. ప్రకాశవంతమైన సూర్య కాంతిలో దూదిపింజవంటి తెలిమేఘంవలె స్వచ్ఛంగా ఉంది. పాల మరుగువంటి మెత్తని వస్త్రాలతో, వెన్నెలను కరగించి పోతపోసినట్లున్న దేహకాంతితో నల్లని మహోన్నత పర్వతశ్రేణినుండి జాలువారే జల పాతంవంటి శిరోజరుచితో, సూర్యోదయాత్పూర్వం తూర్పు దిక్కున వెలిగే తేట వెలుగు రేఖవంటి ఫాల భాగంతో, ఎర్రని రవి బింబంవలె పొగడాలు చిమ్మే రక్తారుణ కుంకుమకాంతితో, తూర్పు కనుమలవంటి కనుబొమలతో, మధ్యాహ్న సూర్యుని కాంతి కిరణంవలె సూటిగా కిందికి జారే నాసికతో, తీయని ఎర్ర పొగడ పండ్లను దగ్గిరజేర్చినట్లున్న అధరాలతో, అభయ హస్త ముద్రతో, వామహస్తాన స్వచ్ఛమైన కలువ మొగ్గతో, కటిప్రదేశాన వజ్రం పొదిగిన వడ్డాణంవలె మెరిసిపోయే తామరపుష్పంతో, ఆకసంనుండి తప్పి జారిన మెరుపు 'తీవెవలె శాంతిశ్రీలను వెదజల్లుతూ నిలబడింది ఆ దివ్యరూపం. ఆమె కన్నులలోని అనంత మైన సజీవరేఖ కళానిలయుని హృదయంలోనికి దూసుకొనిపోయి కన్నీళ్లను వెలికి జిమ్మింది.

కళానిలయుడు పరమాద్భుతమైన ఈ దృశ్యానికి పరవశం పొందాడు. అవకాశం జారవిడుచుకోక అతడి చేతులు లేఖిక కొరకు చిత్రపలక పీఠంపైన తడిమాయి. చేతనున్న లేఖిక చిత్రఫలకంపై కదిలింది. గరగరశబ్దం చేసింది. ముఖచిత్రణ వరకూ వచ్చి ఆగింది.

కళానిలయుడు ఆ దివ్యరూపి వదనంకేసి చూశాడు నిశితంగా. ఆ అధరాల అరుణకాంతి, ఆ కంటి పాపల లోని జీవం, సుపరిచితమైన అతడి హృదయపు లోతు లను తడిమాయి. 'అవును. శాంతి, నా శాంతి చూపు అది. ఆ శాంతి వదనకాంతి అది. అవును నా శాంతి.' కళానిలయు డొక్కసారి ఆగాడు. కాని ఇక ఆలోచించ దలచలేదతడు. 'నా అదృష్టవశాన్న తన ఊహాలోనికి ప్రాణం పోయడానికి ఈ దివ్యమయి అవతరించింది'. గబగబా అతడి లేఖిక కదిలింది. ఆ దివ్య రూపానికి రేఖా రూపం కలిగించాడు.

పడమరన సూర్యకాంతి మెల్లగా జారిపోయింది. దానితోబాటుగా ఆ 'రూపం' చల్లగాలికి కరిగిపోయే మబ్బుతెరవలె మాయమయిపోయింది.

కళానిలయుని హృదయం ఆనందంతో, నిస్పృహతో మూలిగింది. అయోమయంగా కూర్చుండిపోయాడు. రేఖారూపం అయితే తయారయింది. కాని ఇక ముందు కార్యం ఎలా జరుగుతుంది? అతడి మానసిక స్థితి మళ్లీ మొదటివలె అయిపోయింది.

ఆ మరుదినం ఉషఃకాంతులు విరిసే వేళ కళానిల యుడి శిల్ప నిలయంలో స్వప్నంలోని కాంతిపుష్పంవలె ఆ దివ్యరూపం మరల ప్రత్యక్షమైంది. కళానిలయుడి హృదయం ఆనందార్ణవపు మత్తులో ఊయలలూగింది. 'ఈ రూపం నా ఊహకు ప్రతిబింబమే. నా ఊహల పొరల మధ్యనుండి ఇలా భౌతికంగా అవతరించి భ్రాంతి కలిగిస్తూంది' అనుకున్నాడు. మరలా పని ప్రారంభిం చాడు. ఆ నిలయాన అవతరించిన ఆ రూపం తనకు బాసటగా మృత్తికలో ప్రతిమారూపం తయారుచేయ మొదలుపెట్టాడు.

ఆవేళ రాత్రి రోజూవలెకాక కళానిలయుడి ముఖం సజీవంగా ఉండడం గమనించిన సోదర శిల్పులు ఆశ్చర్యపోయారు. *శ్రీ భారతీ లాతని వదనకాంతిని* గమనించి ఆనందంగా చిరునవ్వు నవ్వుకున్నారు. ప్రోత్సాహ కరంగా నలుగురూ అతడి భుజం తట్టారు.

రోజులు గడిచాయి. మృత్తికలో ప్రతిమ రూపం తయారయింది.

కళానిలయుడు ఉలి చేతపట్టాడు. పాలరాతిస్తూపం ఉక్కు ఉలి పదునుతో వింతరూపంలోనికి కోయ బడుతూంది. ఉలి కణకణల శబ్దం దివ్యమైన సంగీ తంలా శిల్ప నిలయాన్ని నింపుతున్నది. ప్రత్యక్ష దేవతా స్వరూప సమక్షాన అతడి ఉలి క్రొత్తపోకడలు కొంగ్రొత్త నడకలు నడవ మొదలెట్టింది. చురుకుగా ముందుకుసాగే ఉలి పదునుకు పాలరాతి ముద్దనుండి మెత్తని వంకరలు, నున్నని అవయవాలు, సన్నని వస్త్రాలు, సున్నితమైన నిమ్నోన్నతాలు తయారవు తున్నాయి. ప్రతిరూపం గొప్పగా తయారవుతూంది.

కళానిలయుడు ఆహార విశ్రాంతులు త్యజించాడు. నిత్యం ఆ దివ్యరూపం సమక్షంలో అతడికి నిత్యనూతన మైన శక్తి సంతరిస్తూంది. అతడి జీవితం ఆ కొద్ది రోజులలో ఆ దృశ్యానికి అలవడిపోయింది.

హేమంతపు శీతలవాయువులు అతడి శరీరంలో సంచలనం కలిగిస్తూండగా ఆ దేవత రూపంనుండి వెలువడే కాంతిలోని నులివెచ్చదనం కార్యభంగంకాకుండ కాపాడింది.



సల్లాపం

ఫోటో—ఎన్. దివాకర్ (మద్రాస్—5)

మూడుపక్షాల అనంతరం అత్యద్భుతమైన శాం దేవత శిల్పరూపం పాలరాతిలో నిగనిగలుపోతూ వెలిసింది ఆ దినం ఉషఃకాలాన కళానిలయుడు సున్నితమై చివరి స్పర్శనాలు పూర్తిచేశాడు.

మహానందంలో ఊగిపోయాడు అతడు. 'నే నిర్మించిన శాంతిదేవత రూపం ఇంత అద్భుతం ఉందా!' అని అతడి హృదయం మూర్ఛపోయింది.

తెల్లని నిర్జీవమైన పాలరాతి ముద్దలో సజీవమై *ఆ రూపం అభయహస్తంతో, విచిత్రమైన మహో* త్కృష్ట భంగిమలో, తెలివెన్నెల వంటి అంబరాలతో మెత్తని దేహకాంతితో, సకల లోకానికి పరిపూర్ణ శాం నందించే అద్భుతమైన కన్నులతో, అలవోకయై చిరునవ్వుతో, చెక్కిళ్లపైన సిగ్గిలిపోయే చిన్న లో లతో, చిన్మయానందకరమైన నోటితో, అలౌకికమైన తేజస్సుతో వెలిగిపోయే నొసటి కుంకుమరేఖతో అప రంగా వెలుగుతూంది.

ఆ నిలయంలో తనకిన్నాళ్ల బాసటగా చిరునవ్వుతో నిలబడిన ప్రత్యక్ష దేవతారూపానికి కళానిలయుడు సజల నయనాలతో మోకరిల్లాడు. మెల్లగా తల ఎత్తి చూచాడు. అక్కడ అతడికి కనుపించినది తన ప్రేమ దేవతా స్వరూపం — అవును, తనను గాఢంగా ప్రేమిం చిన శాంతిది ఆ రూపం.

చేతులెత్తి అర్థిస్తున్నవిధంగా కళానిలయుడన్నాడు. "ఓ దివ్యరూపిణీ! ఓ నా జీవనరేఖా! ఓ ప్రేమ స్వరూపిణీ! ఓ త్యాగమయీ! ఈ అధముడి వద్దకు నీ వెందుకు వచ్చావు దేవీ?"

చేతులెత్తి అలానే ఉండిపోయాడు కళానిలయుడు, కన్నీళ్లతో.

మౌనం కొన్ని క్షణాలు నెలకొన్న ఆ శిల్ప నిలయంలో హఠాత్తుగా వింతవాతావరణం విరిసింది. వేయికోయిలలు ఒక్కమారుగా అమృతగానం చిప్పిల చేస్తున్నట్లు, సురగంగ దేవలోకంనుండి భువికి పారుతూ దివ్యంగా అమరగీతం ఆలాపిస్తున్నట్లు, శరజ్జ్యోత్స్న కలువలను చూసి ముసిముసిగా నవ్వుతున్నట్లు, క్షీరసాగరతటాన తరంగాలు కలకలనాదం చేస్తున్నట్లు, హఠాత్తుగా, మోహావేశకరంగా, మృదువుగా సంగీతం పరిగెత్తింది, గంభీరంగా, మధురంగా, వెండి గజ్జల గలగలవలె ఆ దేవీ స్వరూపంనుంచి మాటలు వెలువడ్డాయి.

"కళానిలయా! నేను నిన్ను ప్రేమించాను. ఇంకా ప్రేమిస్తున్నాను. అందువల్లనే నేను నీవద్దకు వచ్చాను."

కళానిలయుని మనసు తికమక పడింది. "ఏమి దేవీ?" అన్నాడు సంభ్రమంతో.

"అవును, కళానిలయా! నేను నిన్ను ప్రేమి స్తున్నాను. అందువలననే నీకు సాయపడవచ్చాను." మళ్లీ చల్లగా మ్రోగింది ఆ స్వరలహరి.

"నన్నా? ఈ అధముడినా? నిన్ను మోసంచేసిన నన్ను ఇంకా ఇష్టపడుతున్నావా? అద్భుతంగా ఉంది."

"ప్రేమే ఒక పరమాద్భుతం, కళాశ్రీ! నేను నిన్ను ప్రేమించాను. పరమాద్భుతమైన ప్రేమకు బలి అయ్యాను." మరలా తీయని గొంతు వినవచ్చింది.

"నన్ను శిక్షించు దేవీ! ఈ దుర్మార్గుణ్ణి పాపాల